

రవాణాశాఖ కార్యాలయం

పెరిగిన రవాణాశాఖ ఆదాయం

- గత సంవత్సరం కంటే రూ.1.55కోట్లు అదనం
- 2023-24 ఆదాయం రూ.37.70 కోట్లు
- జిల్లా రవాణాశాఖ ప్రోగ్రెస్ రిపోర్టు విడుదల
- జిల్లాలో 1,46,818 వాహనాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఈ ఆర్థిక సంవత్సరం 2024-25 జిల్లా రవాణా శాఖ ఖజానా గలగల లాడింది. రూ.39.25 కోట్ల ఆదాయం సమకూరింది. 2023-24 ఆర్థిక సంవత్సరం కంటే 2024-25 ఆర్థిక సంవత్సరం రూ.1.55 కోట్లు అదనంగా ఆదాయం సమకూరింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ. 33.08 కోట్ల ఆదాయం వచ్చింది. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో రూ.37.70 కోట్లు ఆదాయం వచ్చింది. 2024-25 ఆర్థిక సంవ త్సరంలో రూ 39.25 కోట్ల ఆదాయం లభించింది. ఇందులో త్రైమాసిక ట్యాక్స్ రూపంలో రూ. 6 కోట్ల 78 లక్షల 64 వేల ఆదాయం సమకూరింది. లైఫ్ ట్యాక్స్‌లో రూపంలో రూ.22 కోట్ల 57 లక్షల 55 వేలు, వివిధ ఫీజుల నిమిత్తం వచ్చిన అదాయం రూ.4 కోట్ల 68 లక్షల 15 వేలు, సర్వీస్ ఫీజులు రూపేణా రూ. కోటి 49 లక్షల 79 వేలు లభించింది. గ్రీన్ ట్యాక్స్ రూపంలో రూ. 53 వేల ఆదాయం వచ్చింది. జరిమానాల ద్వారా రూ. కోటి 84 లక్షల 15, 305 ఆదాయం లభించింది. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో త్రైమాసిక ట్యాక్స్ రూ. 6.70 కోట్లు ఆదాయం సమకూరింది. లైఫ్ ట్యాక్స్‌లో రూ.23.80 కోట్లు, వివిధ ఫీజుల ద్వారా రూ 4.93 కోట్లు, రూ 1.28 కోట్లు లభించింది. జరిమానాల ద్వారా రూ. 97.7 లక్షలు లభించాయి

వ్యక్తిగత వాహనాల పైనే ఆసక్తి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 5.52 లక్షల జనాభా ఉంది. దాదాపు 1.77 లక్షల ఇళ్లు ఉన్నాయి. 1.46 లక్షల వాహనాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం వాహనాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ సంవత్సరం ఎలక్ట్రానిక్ వాహనాలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ద్విచక్ర వాహనాలు 1,01,902, కార్లు 13,279, స్కూల్ బస్సులు 162, రవాణా క్యాబ్‌లు 89, లగ్జరీ టూరి స్ట్ క్యాబ్‌లు 15, జీపులు 14, మోటార్ క్యాబ్‌లు 1,198, ప్రైవేటు ఓమ్ని బస్సులు 223, రోడ్ రోలర్‌లు 2, స్టేజీ క్యారియర్‌లు మోపెడ్, అండ్ మోటారైజ్‌డ్ సైకిల్ 4,959, త్రీవీలర్ గూడ్స్ వాహనాలు 1,439, వ్యవసాయ ట్రాక్టర్‌లు 5,609, కమర్షియల్ ట్రాక్టర్‌లు 4,196, సరుకుల రవాణా వాహనాలు 3042, ప్రైవేటు క్రేన్‌లు 8, కన్‌స్ట్రక్షన్ కు సంబంధించిన వాహనాలు 236, హార్వెస్టర్‌లు 660, అంబులెన్స్‌లు 39, ఆటోలు 3,673లతో పాటు ఇతర వాహనాలు కూడా జిల్లాలో పెరిగాయి.

ట్యాక్స్‌లు, ఇన్సూరెన్స్‌లు సకాలంలో చెల్లించుకోవాలి

లక్ష్మణ్, జిల్లా రవాణాశాఖ అధికారి



వాహనాల యజమానులు ట్యాక్స్‌లు, ఇన్సూరెన్స్‌లు సకాలంలో చెల్లించుకోవాలి. ఎప్పుడైనా అనుకోని సంఘటన చోటు చేసుకున్నప్పుడు పరిహారం పొం దే వీలు ఉంటుంది. ట్యాక్స్‌ల చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా రవాణాశాఖ ఆదాయం ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ. 39.25 కోట్లు వచ్చింది. వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్, ట్యాక్స్‌లు చెల్లించాలి. వాహనాలకు హైసెక్యూరిటీ నేమ్ ప్లేట్‌లు అమర్చుకోవాలి.

'వనజీవి' జ్ఞాపకం

- సిరిసిల్లకు నాలుగు సార్లు వచ్చిన రామయ్య



సిరిసిల్ల కళాశాల గ్రౌండ్‌లో మొక్కనాటుతున్న రామయ్య(ఫైల్)

సిరిసిల్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పకృతి ప్రేమికుడిగా కోటి మొక్కలు నాటి పద్మశ్రీ అవార్డు అందుకున్న వనజీవి రామయ్య మృతికి సిరిసిల్ల ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. శనివారం ఆయన మృతిపై పకృతి ప్రేమికులు నివాళులర్పించారు. సిరిసిల్లకు వచ్చిన ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పద్మశ్రీ అవార్డు అందుకున్న తర్వాత మొక్కలు నాటడంతో అవగాహన కల్పించే దిశగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు నాలుగు సార్లు వనజీవి రామయ్య వచ్చారు. సిరిసిల్లకు చెందిన పకృతిప్రేమికుడు ప్రకాష్ సిరిసిల్లకు రామయ్య దంపతులను ఆహ్వానించారు. రామయ్య అప్పటి జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, అప్పటి డీపీఆర్వో దశరథంలతో కలిసి సిరిసిల్ల జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. సుద్దాల గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం లోకి వచ్చి 15 నెలలు గడుస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రినియమించక పోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో విద్యావ్యస్థను భ్రష్టు పటించడంతో పాటు విద్యార్థుల సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని ఒక వైపు ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మరోవైపు ప్రైవేటు విద్యను పెద మధ్యతరగతి విద్యార్థులకు అందకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. వేలాది మంది కార్పొరేట్ స్థాయి విద్యనందించిన గురుకులాలను నిర్వీర్యం చేస్తున్నారని ఈ విద్యా సంవత్సరం బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్, సామలశ్రీకాంత్, అదిచెర్లసాయి, కాసర్ల వినయ్, మ్యాన కృష్ణ, కొండినవీన్, రాపెల్లి భాను, కస్తూరి అజ్జు, సాయి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

చందుర్తి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైతును రారాజుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంతో పాటు కిష్టంపేట గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తూ కొనుగోలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం కొనుగులు కేంద్రాలను వారికి కేటాయించారన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, ఎరువులు, మేలైన వంగడాలను ప్రభుత్వం తరుపున అందిస్తున్నామన్నారు. రైతులకు ఏకకాలంలో రైతు ప్రయోజనాలు కోసం రూ. 21 వేల కోట్ల మేర రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం పంపిణీ చేయడం కోసం అదనంగా నూతన లారీ ఏజెన్సీలకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. సన్న వడ్లు పండించే రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్వింటాల్‌కు అదనంగా రూ.500 ఇస్తున్నదని తెలిపారు. సన్న బియ్యం పంపిణీపై బిజెపి రాజకీయం చేస్తోందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యాన్ని ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. జిల్లా పరిధిలో సుమారు 600 కోట్లు పై చిలుకు, చందుర్తి మండల పరిధిలో 40 కోట్లు బ్యాంక్ లింకేజ్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. చందుర్తి మండల మహిళా సమైక్యకు 30 లక్షలతో బస్సు మంజూరు చేయడం జరిగిందని తెలి పారు. మహిళలు ముందుకు వస్తె రైస్ మిల్లు ఏర్పాటు చేసుకోవ డానికి అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలకల తిరుపతి, వైస్ చైర్మన్ బోజ్జ మల్లేశం మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, ఎఆర్‌డిఐ శ్రీనివాస్, బిపిఎం శ్రీని వాస్, ఎంఎఐ అనూష, ఐకెపి ఏపీఎం రజిత, ఆర్ఐ శ్రీనివాస్, డైరెక్టర్లు మర్రి కృష్ణ, నాగుల శంకర్, నాయకులు మ్యాకల గణేష్, భీమారాజు కనకరాజు, ముస్కు ముకుందరెడ్డి, గొట్టె ప్రభాకర్, వెల్పుల దేవస్వామి, పులి సత్తయ్య, రంజీత్, లక్ష్మారెడ్డి, దేవరాజు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



కిష్టంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని అనంతపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందా లన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఏవో ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు సమాజంలో ఉన్నతమైన గౌరవం దక్కుతుందని, యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలని మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపుఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఆటలు నేడు ఉపాధి మార్గాన్ని చూపిస్తున్నాయన్నారు. పోటీలలో ఎలగందుల ప్రథమస్థానంలో, తంగళ్లపెల్లి జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. విజేతలకు నగదుతో పాటు ట్రోఫీలను అందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, నాయకులు కూనబోయిన బాలరాజు, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, అంతగిరి వినయ్, గొడుగు నర్సయ్య, తిప్పారపు శ్రావణ్, రాకం సుమన్, గౌతం, నిర్వాహకులు దాసరి జనార్దన్, యాస సన్ని, నిఖిల్, బాబు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి

- అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్



మాట్లాడుతున్న అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవదాస్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 12 (అంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని ప్రజలందరూ ఘనంగా జరుపుకుని విజయవంతం చేయాలని జిల్లా అంబేద్కర్ సంఘం కత్తెర దేవదాస్ కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం చేపట్టే అంబేద్కర్ జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడంతో పాటు ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల వారిని ఆహ్వానించాలని కోరారు. అలాగే జిల్లా కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి దళిత వర్గాలకు చెందిన వారితో పాటు మేధావులు, విద్యావేత్తలు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొట్టేపల్లి సుధాకర్, కార్యదర్శి అవునూరి వెంకటరాములు, తాజామాజీ కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, తంగళ్లపల్లి దేవయ్య, పంగ రవి, కత్తెర వరుణ్‌కుమార్, తంగళ్లపల్లి మహేష్, పంగ మధు, పంగ శివ, మెట్టురాజు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

వీర్నపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని వేములవాడ అసెంబ్లీ కన్వీనర్, మండల ఇన్‌చార్జి మార్త సత్తయ్య అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో బీజేపీ క్రియాశీల సభ్యుల సమావేశాన్ని మండల అధ్యక్షుడు మాలోతు లక్పతి నాయక్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు అందరూ సమష్టిగా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అందించిన నిధులతో జరుగుతుందన్నారు. గ్రామాలలో ఈజీఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్న ఘనత బీజేపీ పార్టీదేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు మాడుగుల లింబాద్రి, బీజేవైఎం మండల అధ్యక్షులు బండారి మహేష్, సీనియర్ నాయకులు పీర్యా, ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంస్కృతం ఉత్తర్వులను ఉపసంహరించాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సంస్కృతం ద్వితీయ భాషగా ప్రవేశపెట్టాలనే ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలంగాణ వివేక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసరవేణి పర్శరాములు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ మాతృభాషకు విద్యార్థులను దూరం చేయడం సరైంది కాదని అన్నారు. మాతృభాష తెలుగును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పీజీ విద్య వరకు అమ్మలాంటి తెలుగు భాషను ప్రభుత్వం నిర్బంధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మెలగాలి

- సీఐ శ్రీనివాస్‌గౌడ్



గంభీరావుపేటలో చలివేద్రం ప్రారంబిస్తున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

గంభీరావుపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు తమ వృత్తి నిబద్ధతతో పాటు సామాజిక బాధ్యత నిర్వర్తించడం ఆదర్శనీయమని, వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత నిర్వర్తించాలని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని గాంధీ వద్ద డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ శ్రీనివాస్‌గౌడ్ శనివారం ప్రారంభించారు. వేసవిలో తాగునీటి సౌకర్యం కల్పించడం మంచి ఆలోచన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్, డిటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి, జిల్లా ప్రదాన కార్యదర్శి సుదాకర్‌రెడ్డి, మండల విద్యాధికారి గంగరాం, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం బాల ఎల్లయ్య, రాష్ట్ర కౌన్సిలర్ ఎర్ర సత్యనారాయణ, మండల అధ్యక్షుడు శీలకుమార్, ప్రధాన కార్యదర్శి దోసల మధు, జిల్లా కార్యదర్శి విష్ణుప్రసాద్, డిటీఎఫ్ నాయకులు ధైత శ్రీనివాస్, శనిగరం ఆనందం, దోసల శ్రీనివాస్, సంపత్ కుమార్, కుమ్మరవేణి శ్రీనివాస్, పాశం తిరుపతిరెడ్డి, మిట్టపల్లి దేవేంద్రం, బద్రుద్దీన్‌ఖాన్, రాజు, భరత్‌రెడ్డి, చింతల రాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు



గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న స్వాములు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో శ్రీ స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం పూర్ణిమ సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. దీంట్లో భాగంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి విశేష అలంకరణ చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులతో పల్లకిలో గిరి ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు మచ్చ శ్రీనివాస్, గజభీంకర్ రాజన్న, రాపెల్లి ఆనందం, మచ్చ అంజనేయులు, సామల రమేష్, భక్తులు పాల్గొన్నారు. ప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు.

కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. మండలంలోని ఇల్లంతకుంట, జంగంరెడ్డిపల్లి గ్రామాలలో సన్మానాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, ఐలయ్యలతో పాటు సంఘ నాయకులు పాల్గొన్నారు

రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పెంచాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరాడు. దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడానికి ఆలస్యం కావడం వల్ల అర్హులు నష్టపోయో అవకాశం ఉందన్నారు. నెట్‌వర్క్ సమస్య వల్ల ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోలేక పోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి గడువు పెంచాలని కోరారు.

విద్యానగర్ వెల్ఫేర్ అసోషియేషన్ కార్యవర్గం



విద్యానగర్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోషియేషన్ కార్యవర్గం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని విద్యానగర్‌లో జరిగిన డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోషియేషన్ సమావేశంలో అధ్యక్షుడిగా గుడ్ల కిషన్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిమల్ల కొండయ్య, ఉపాధ్యక్షులుగా జితేందర్, కోశాధికారిగా గుర్రం మహేందర్‌లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు శ్రీధర్, సుభాష్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో వంకాయల కార్తీక్, తిరుపతిరెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం అంజనేయులు, సభ్యులు అభిలాష్, స్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాలకు జనజీవన స్రవంతిలోకి..

● స్వగ్రామానికి చేరిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలు



కాంకేట్ ఎస్పీ నుంచి విడుదల పత్రం అందుకుంటున్న కుటుంబ సభ్యులు

కోరుట్ల/కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పోరాటంలో నాలుగు దశాబ్దాలుగా వివిధహోదాల్లో పనిచేసి పోలీసుల ఎదుట లొంగిపోయిన మండలంలోని సిరికొండకు చెందిన బత్తుల గాంబాలు అలియాస్ పసుల వసంత శనివారం స్వగ్రామం చేరుకున్నారు. పీపుల్స్ వార్‌లో కోరుట్లకు చెందిన భర్త పసుల రాంరెడ్డితో కలిసి పలురాష్ట్రాల్లో కీలక పదవుల్లో కొనసాగారు. భర్త రాంరెడ్డి2001లో మద్దిమల్ల ఎన్‌కౌంటర్‌లో మరణించగా వసంత పార్టీలోనే కొనసాగారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నార్త్ బస్తర్ డివిజన్ ఇన్‌చార్జిగా, ప్రాంతీయ ఆదివాసీ మహిళా సంఘటన్ సీవోగా, కేంద్ర కమిటీ సభ్యురాలిగా కొనసాగిన వసంత అనారోగ్య కారణాలతో గత ఏడాది సెప్టెంబరులో కాంకేర్ జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోయారు. పూర్తి స్థాయిలో కుటుంబసభ్యుల వివరాలు సేకరించిన పోలీసులు శనివారం కుటుంబసభ్యులకు విడుదలపత్రం అందజేస్తూ అప్ప గించారు. కూతురు భవానీ, మేనల్లుడు బత్తుల నరేశ్ కాంకేర్ వెళ్లి వసంతను స్వగ్రామానికి తీసుకువచ్చారు. దాదాపు నలభై సంవత్సరాల తర్వాత ఇంటికి చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మేనల్లుడు నరేశ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మంథని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. పక్కాసమాచారంతో మంథని శివారులోని పోచమ్మగుడి సమీపంలో డబ్బులు పెట్టి పేకాటఆడుతున్న ఏడుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఇప్పపల్లిలో మహిళ అదృశ్యం



దేవేంద్ర (ఫైల్)

కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పపల్లిలో యాగండ్ల దేవేంద్ర(50) అనే మహిళ అదృశ్యమైంది. రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లినదేవేంద్ర ఇంటికిరాకపోవడంతో కుటుంబసభ్యులు కలవరపడ్డారు. ఈక్రమంలో భర్త భూమయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కొంతకాలంగా దేవేంద్ర కుటుంబం అప్పులబాధతో సతమతమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

'ఐసర్'తో IISER బంగారు భవిష్యత్తు



- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏడు విద్యాలయాలు
- ఇంటర్ విద్యార్థులకు ప్రవేశం
- ఐదేళ్ల బీఎస్-ఎంఎస్ ఇంటిగ్రేటెడ్ కోర్సులు
- భవిష్యత్ శాస్త్రవేత్తలు, పరిశోధకులను తీర్చిదిద్దడమే లక్ష్యం

చొప్పదండి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో శాస్త్రవిద్యను ప్రోత్సహించడం, విద్యార్థులను భవి ష్యత్ శాస్త్రవేత్తలు, పరిశోధకులుగా తీర్చి దిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఐసర్ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఐఐటీకి దీటుగా సైన్స్ విద్యార్థుల కోసం ఐసర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యు కేషనల్ రీసెర్చ్) విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం 2006లో ప్రారంభించింది. ప్రస్తుతం దేశంలో ఏడు విద్యాలయాలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థలు శాస్త్ర రంగంలో అత్యుత్తమ విద్యను, పరిశోధన అవకాశాలను అందిస్తున్నాయి. ఇంటర్ తర్వాత ఎంపీసీ విద్యార్థు లకు ఐఐటీలో ప్రవేశాల మాదిరిగా బైపీసీ ఆధ్వర్యంలో ఐసర్‌లో ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను చేర్చుకుంటాయి. ప్రస్తుతం ఐసర్‌లో ప్రవేశానికి ప్రక్రియ ప్రారంభమై నేపథ్యంలో ఆ వివరాలు విద్యార్థుల కోసం..



● ముఖ్యమైన తేదీలు

- విద్యార్థులు ఐసర్ పోర్టల్‌లో ఏప్రిల్ 15 లోగా దరఖాస్తులు సమర్పించుకోవాలి.
- దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఏప్రిల్ 21, 22న అవకాశం కల్పిస్తారు.
- హాల్‌టికెట్ల విడుదల మే 15
- ప్రవేశ పరీక్ష మే 25న నిర్వహిస్తారు.
- ఐసర్ పోర్టల్: www.iiseradmission.in

● బీఎస్, ఎంఎస్ డ్యుయల్ డిగ్రీ...

ఐఏటీ (ఐసర్ అప్టిట్యూడ్ టెస్ట్) ద్వారా ఇంటర్ సైన్స్ విద్యార్థులను ప్రవేశ పరీక్ష ద్వారా విద్యాల యంలో ప్రవేశం కల్పిస్తారు. బీఎస్, ఎంఎస్ (బ్యాచిలర్ ఆఫ్ ఐన్స్, మాస్టర్ ఆఫ్ సైన్స్) ఐదేళ్ల కోర్సును ఆఫర్ చేస్తున్నారు. మొదటి రెండు సంవత్సరాలు ఫౌండేషన్ కోర్సు ఉంటుంది. ఫిజిక్స్ మ్యాథ్స్ కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టుల్లో విద్యా బోధన చేస్తారు. తర్వాత రెండు సంవత్సరాల్లో వి ద్యార్థి తనకు ఇష్టమైన సబ్జెక్టులో స్పెషలైజేషన్ ఎంచుకోవాలి. చివరి ఏడాది రీసెర్చ్ ప్రాజెక్టు ఉంటుంది.

● ప్రవేశ పరీక్ష...

ఐసర్‌లో ప్రవేశానికి మూడు మార్గాలు ఉం టాయి. కేవీపీవై, ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ చానల్ (ఐఐటీలో మంచి ర్యాంకు వచ్చిన విద్యార్థులకు అవకాశం ఉంటుంది). ప్రధానంగా ఐసర్ యాప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహించి విద్యార్థులను మెరిట్, కేటగిరీ ద్వారా ఎంపిక చేస్తారు. ఇంటర్‌లో పీసీఎంబీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయోలజి) సబ్జెక్టులు చదివిన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులు. పదో తరగతిలో 60 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీలకు 55 శాతం మార్కులు ఉండాలి. ప్రవేశ పరీక్షలో 60 ప్రశ్నలు ఉండగా ఒక్కో సబ్జెక్ నుంచి 15 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి జవాబుకు నాలుగు మార్కులు ఉంటాయి, తప్పు సమాదానికి 1 మైనస్ మార్కు ఉంటుంది. మొత్తం 240 మార్కులకు పరీక్ష ఉంటుంది.

● దేశంలో ఏడు విద్యాలయాలు..

దేశంలో ఏడు ఐసర్ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం స్థాపించింది. ఐసర్ పూణే, కలకత్తా, మొహాలీ, భోపాల్, తిరువనంతపురం, తిరుపతి, బరంపురంలో విద్యాలయాలు ఉన్నాయి. దేశంలో మొత్తం 2,363 సీట్లు ఉండగా తిరుపతి ఐసర్‌లో 350 సీట్లు, బరంపురం 300, భోపాల్ 300, తిరువనంతపురం 320, పుణే 288, కలకత్తా 280, మొహాలీలో 270 సీట్లు ఉన్నాయి. ఇవి కాకుండా భోపాల్ ఐసర్‌లో బీటెక్ విభాగంలో 140 సీట్లు, ఎకనామిక్స్‌లో 50 సీట్లు ఉన్నాయి. ఐసర్‌లో టాప్ లెవల్ సైన్స్ విద్యను ఫ్యాకల్టీ అందిస్తుండగా, ఉన్నతస్థాయి ల్యాబ్‌లు, అంతర్జాతీయ సంస్థలు అనుసంధానం, రీసెర్చ్ అవకాశాలను కల్పిస్తున్నాయి. విద్యార్థులకు ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తూ అధునాతనమైన హాస్టల్ వసతిని విద్యాసంస్థలు కల్పిస్తున్నాయి.

వంతెనపై భారీ వాహనాలు ఢీ

● క్యాబిన్‌లో ఇరుక్కున్నడ్రైవర్ ● సురక్షితంగా బయటకు తీసిన స్థానికులు

కోరుట్లరూరల్ (మెట్‌పల్లిటౌన్), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ జాతీయ రహదారిపై ఉన్న వంతెనపై రెండు భారీవాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. వంతెనపై భారీ వాహనాలు ఢీకొట్టుకోగా వాహనంలోని క్యాబిన్‌లో లారీ డ్రైవర్ ఇరుక్కున్నాడు. గమనించిన స్థానికులు అతి కష్టంమీద బయటకు తీసి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం ఎస్‌ఐలు భారీ వాహనాలను ఎక్స్‌కావేటర్ సహాయంతో తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. అప్పటి వరకు జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచి పోయాయి.



ప్రమాదానికి గురైన భారీ వాహనాలు

తొలితరం కమ్యూనిస్టు యోధుడిని కోల్పోయాం

ఎలిగేడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ తొలితరం నాయకుడిని కోల్పోయిందని సీపీఐ జాతీయకమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడవెంకటరెడ్డి అన్నారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు తానిపర్తి కాంతారావు ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ తొలితరం కమ్యూనిస్టు నాయకుడని, మంచి ఆదర్శ భావాలున్న వ్యక్తి అని కొనియాడారు. ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించడం గొప్పవిషయంగా చెప్పుకొచ్చారు. వారిత్యాగాలు, జీవిత విశేషాలు నేటి కమ్యూనిస్టు నాయకులు ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని సూచించారు. 30ఏళ్లపాటు సర్పంచ్‌గా పనిచేసి పేద, అట్టడుగువర్గాల సంక్షేమానికి నిరంతరం కృషిచేశారన్నారు. రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కలవేణశంకర్, జిల్లాకార్యదర్శులు తాండ్రసదానందం, మేకలదాస్, జిల్లా ఏఐటీయుసీ ప్రధానకార్యదర్శి కడారి సునీల్, మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, నాయకులుతానిపర్తిమోహన్ రావు, ఆయన కటుంబసభ్యులు పాల్గొన్నారు.



కాంతారావుకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

వరుస దొంగతనాలతో వణికిపోతున్న అన్నారం గ్రామస్థులు

● రాత్రివేళ గస్తీ తిరుగుతున్న యువకులు

● పోలీసులకు సవాలుగా మారిన దొంగతనాలు

మానకొండూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో వరుస దొంగతనాలతో గ్రామస్థులు వణికిపోతున్నారు. మార్చి 25న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు ఇళ్లలో చొరబడి నగదు, బంగారు, ఆభరణాలు, మోటార్‌సైకిల్‌ను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 9న అర్ధరాత్రి గ్రామ సమీపంలోని వరాహగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడి స్వామివారి హుండీని పగులకొట్టి నగదు అందులోని నగదు, స్వామివారి వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. 15రోజులలో రెండు వరుస దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. గతనెల 25న ఒకేరోజు గొట్టిముక్కల విజయ, మధునాల వెంకటమ్మ, రుద్రోజు వెంకటాచారి ఇంటి తాళాలు పగులకొట్టి నగదు, నగలు, పాకాల రాజిరెడ్డి ఇంటి ముందు పార్కు చేసిన మోటార్ సైకిల్‌ను ఎత్తుకెళ్లారు. ఇలా వరుస దొంగతనాలతో రాత్రి వేళలో యువకులు కర్రలను పట్టుకొని వీధులలో గస్తీ తిరుగుతున్నారు. ఇప్పటికి 18రోజులైనా దొంగలు పట్టుబడక పోవడం పోలీసులకు సవాలుగా మారింది.

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

● కాలిబూడిదైన ధాన్యం, గోనె సంచులు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రికర్ల గ్రామంలోని మహాలక్ష్మి రైస్‌మిల్లులో శనివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో సుమారు రెండుకోట్ల రూపాయల ఆస్తినష్టం వాటిల్లిందని యజమాని గంగారెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున ప్రమాదవశాత్తు రైసు మిల్లులో నుంచి దట్టమైన పొగతో కూడిన మంటలు రావడాన్ని అక్కడే ఉన్న కూలీలు గమించి యజమాని గంగారెడ్డితో పాటు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి అగ్నిమాపకసిబ్బంది చేరుకొని మంటలార్పి వేశారు. రైసుమిల్లు షెడ్‌తో పాటు సుమారు ఐదు వేల క్వింటాళ్ల ధాన్యం, 80వేల పాత, 10వేల కొత్త గోనె సంచులు కాలిబూడిదైనట్లు యజయాని తెలిపారు. దీంతో సుమారు రెండు కోట్ల విలువైన ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన చెందారు. రైస్ మిల్లును సివిల్‌సప్లయి అధికారులు, ఆర్‌ఐ ఉమేష్ పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదా విషయమై హత్యాయత్నం కేసులో సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కలికోట పృథ్వి(23), కలికోట రేణుక(39), ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పాతూరి సాయికృష్ణ(34), సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన నక్క వెంకటేశ్(24), ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పేయింటర్ సృజన్(21), సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పెయింటర్ కనకం నరేశ్(38)లను శనివారం రాత్రి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల టౌన్ సిఐ కె. కృష్ణ తెలిపారు. నిందితుల వద్ద ఒక కత్తి , ఆరు మొబైల్ ఫోన్స్, ఒక మోటార్ సైకిల్, ఒక కారును సీజ్‌చేశామని ఆయన తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... కలికోట రేణుక తన మరిది వెంకటేశ్‌కు మధ్య ఇంటి దారి విషయమై గత కొద్దిరోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. రేణుక చిన్న కొడుకు పృథ్వి ఎల్లారెడ్డిపేటకు చెందిన పాతూరి సాయికృష్ణ అనే పెయింటింగ్ కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తుం డేవాడు. రేణుక భర్త చనిపోవడంతో కాంట్రాక్టర్ సాయికృష్ణకు రేణుక సాన్నిహిత్యం పెరిగింది. రేణుక తన మరిది వెంకటేశ్ మధ్య గొడవలు జరుగుతుండటంతో వెంకటేశ్‌ను అతని కుటుంబాన్ని పృథ్వీచేత చంపించాలని సాయికృష్ణ, రేణుక కలిసి పథకం వేశారు. ఈ పథకంలో భాగంగానే తన మరిదితో దారి విషయం గొడవ ఉందని, ప్రతి రోజు తనను బూతులు తిడుతున్నారని వెంకటేశ్ కుటుంబాన్ని చంపివేస్తే ఇల్లు , స్థలం మనకే వస్తుందని కుమారుడు పృథ్విని పురమాయించారు. ఇందుకు రేణుక, సాయికృష్ణలు కలిసి పృథ్వీ తన స్నేహితులైన కనకం నరేశ్, సృజన్, వెంకటేశ్‌లకు మద్యం తాగించి తన బాబాయ్ కుటుంబాన్ని అంతమొందించాలని పథకం ప్రకారం ఈ నెల 8న కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి ఆరుగురు నిందితు లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో పెద్ద కత్తి పట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇప్పలపల్లి గ్రామానికి చెందిన సలేంద్రి రాకేశ్(26) అనే వ్యక్తిని శనివారం రాత్రి అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఇతని వద్ద ఒక పెద్ద కత్తి, చిన్న బటన్ చాక్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కూలి చేసుకుంటే జీవించే రాకేశ్ తాగుడుకు బానిసై గతంలో వేములవాడలో దొంగతనాలకు పాల్పడగా జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. మళ్లీ సిరిసిల్లలో తిరుగుతూ భయానక వాతావరణ సృష్టించాలని కరీంనగర్‌లో పెద్ద కత్తి కొనుగోలుచేసి ద్విచక్రవాహనంలో పెట్టుకొని తిరుగుతూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదుచేసి అతడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● పేలిన వంటగ్యాస్ సిలిండర్



ఇంట్లో నుంచి వస్తున్న పొగలు

కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలం లోని సిరికొండలో సుద్దాల బుచ్చిరాజు అనే మహిళకు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో శనివారం దగ్ధమైంది. కొన్నేళ్ల క్రితం బిగించిన విద్యుత్‌వైర్లు సరిగా లేకపోవడంతో షార్ట్‌సర్క్యూట్‌కు కారణమైంది. మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న వంటగ్యాస్ సిలిండర్ పేలి పైకప్పు లేచిపోయింది. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైరింజన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, దుస్తులు, ఇతరత్రా సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. పక్క ఇంట్లో ఉన్న ఆశా కార్యకర్తకు చెందిన రిజిస్టర్లు కాలిపోయాయి. మరో పక్కన సుద్దాల నరేశ్ అనే కానిస్టేబుల్ ఇల్లు కూడా పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో నుంచి మంటలు వస్తున్న విషయం గమనించిన స్థానికులు ఆ ఇంట్లో ఉన్న అంధురాలైన వృద్ధురాలిని హుటాహుటిన బయటకు తెచ్చి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని నష్టానికి సంబంధించిన వివరాలను అంచనా వేశారు.

ఆర్టీసీ బస్సులో యువకుడి అసభ్య ప్రవర్తన

తంగళ్లపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీబస్సులో మద్యం తాగిన ఓ వ్యక్తి యువతులపై అసభ్యంగా ప్రవర్తించడంతో దేహశుద్ధి చేశారు. వివరాల్లోకి వెళితే సిద్ధిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేములవాడ నుంచి సిద్ధిపేటకు వెళ్తున్న సమయంలో మధ్యలో మద్యం సేవించిన ఓ ప్రయాణికుడు ఎక్కాడు. బస్సు తంగళ్లపల్లి మండలం సారంపల్లి మీదుగా వెళ్తున్న సమయంలో మద్యం మత్తులో ఆ వ్యక్తి యువతులతో అసభ్యంగా ప్రవర్తించాడు. యువతులు అతన్ని ప్రశ్నించడంతో వారిపై దాడికి యత్నించాడు. దీంతో యువతులు అతనికి దేహశుద్ధి చేశారు. డ్రైవర్ బస్సును నిలిపి నేరెళ్లలో అతన్ని దింపివేశాడు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను ఓప్రయాణికుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

● పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి బంధువుల ఫిర్యాదు



కమిలిపోయిన విద్యార్థి వీపు

గంభీరావుపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి విద్యార్థిపై ఓ ఉపాధ్యాయుడు ప్రతాపం చూపించాడు. విద్యార్థి వీపుపై బాదడంతో తీవ్రంగా కమిలిపోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ప్రాథమిక పాఠశాలలో లవన్‌సాయి అనే ఆరేళ్ల బాలుడు ఒకటో తరగతి చదువుతున్నాడు. శనివారం తరగతి గదిలో ఉపాధ్యాయుడు దేవరాజు లవన్‌సాయి అల్లరి చేస్తున్నాడని తీవ్రంగా కొట్టాడు. దెబ్బ లకు విద్యార్థి వీపు ఎర్రగా కమిలిపోయింది. సమాచారం అందు కున్న విద్యార్థి బంధువులు పాఠశాలకు చేరుకుని ప్రశ్నించగా అప్పటికే ఉపాధ్యాయుడు దేవరాజు పాఠశాల నుంచి జారుకు న్నాడు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రామచంద్రంపై విద్యార్థి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లవన్‌సాయిని సిరిసిల్ల ఆసుపత్రికి తీసు కెళ్లి చికిత్స అందించారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అందని పరిహారం

● నిలిచిన అప్రోచ్‌రోడ్డు పనులు

● ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలంటున్న మండల ప్రజలు



గుంతలమయమైన మట్టి రోడ్డు


రామడుగు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామడుగు బ్రిడ్జి నిర్మించిన అధికారులు దానికి అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదు. రామడుగు వాగుపై శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిస్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి ఏడుసంవత్సరాలక్రితం సుమారు రూ.8కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు డబ్బులు చెల్లించకపోవడం, తదితర కారణాలతో ఆరు సంవత్సరాలపాటు నత్తనడకన పనులు సాగాయి. దాదాపు 8మంది నిర్వాసితులు ఉండగా వారికి కోటి55లక్షల రూపాయల పరిహారం రావాల్సి ఉందని తెలుస్తోంది. పాతబ్రిడ్జి గత వానలకు పూర్తిగా కూలిపోయింది. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు త్వరలోనే డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో పనులు కొనసాగుటకు రైతులు సహకరించారు. దీంతో బ్రిడ్జినిర్మాణం పూర్తవగా కొద్దినెలలుగా వాహనరాకపోకలు కొనసాగుతున్నాయి. బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు నిర్మించకపోవడంతో వానలకు గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ప్రస్తుతం వేసవినేపథ్యంలో దుమ్ముతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఒక దశలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే హామీ ఇచ్చిన మేరకు ఇప్పటివరకు డబ్బులు అందకపోవడమే ప్రధానకారణం.

ఓవైపు డబ్బులు రాక రైతులు ఆందోళన చెందుతుండగా మరోవైపు మండల ప్రజలు రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు పరిహారం అందితే తప్ప నిర్మాణం జరిగే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఎమ్మెల్యే చొరవ తీసుకుని రైతులకు పరిహారం ఇప్పించి అప్రోచ్ రోడ్డు పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జైన విగ్రహాన్ని కాపాడుకోవాలి

● డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి



జైన విగ్రహం వద్ద డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సుమారు 1100ఏళ్లనాటి చరిత్రకు నిదర్శనం పాతబజార్ గౌరీశంకరాలయమని, ఆ ఆలయ ప్రాంగణంలోని జైన విగ్రహంపై రంగులు తొలగించి కాపాడాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియాఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. స్థానిక యువ చరిత్ర పరిశోధకుడు కొల్లూరి శివకుమార్ సమాచారంతో శనివారం ఆలయంలో జైన విగ్రహాన్ని పరిశీలించారు. వేములవాడ చాళక్యుల కాలపు ఈవిగ్రహం24 తీర్థంకరులలో ఒకరైన సుపార్శ్వనాథ్‌గా తెలిపారు. విగ్రహం భూమిలో కూరుకపోయి ఎర్రని రంగు పూయడంతో 1100 సంవత్సరాల చరిత్ర కోల్పోయామన్నారు. ఇప్పటికైనా చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ విగ్రహానికి రంగులు తొలగించి భద్రత కల్పించాలని ఆలయ అధికారులకు, కరీంనగర్ జైన సంఘం బాధ్యులకు విజ్ఞప్తి చేశారు. మరో జైన విగ్రహం ఉండగా ధ్వంసమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర పరిశోధకుడు సంకేపల్లి నాగేంద్రశర్మ, కొల్లూరి సాయికుమార్, శిల్పి బి సుధాకర్ సింగ్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బోయినపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలంలోని మల్లాపూర్ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. శనివారం మల్లాపూర్ శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లారు. ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించడంతో వారి వద్ద నుంచి 8,200 నగదు, ఆరు సెల్‌ఫోన్లు రెండు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

దాగుడు మూతలు.. దండాకోర్!



● కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలు

● చిన్నారులకు వేసవిలో ఆటవిడుపు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పచ్చనైన పల్లె సీమల్లో మట్టి పరిమళాల మధ్య సంప్రదాయ గ్రామీణ క్రీడల్లో శారీరక ఆరోగ్యం పెంపొందించుకున్న కాలం నుంచి స్మార్ట్ ఆటల యుగం నడుస్తోంది. ఈ హైటెక్ ఆటల ముందు ప్రాచీన గ్రామీణ క్రీడలు చిన్నబోతున్నాయి. నిజానికి వేసవి సెలవులు పిల్లలకు ఒక ఆట విడుపు. సెలవుల్లో పిల్లలకు వేసవి శిబిరాలు లేకపోతే ఇంట్లో టీవీ, వీడియో గేమ్స్, బయటకొస్తే క్రికెట్.. ఇది మాత్రమే ఇప్పటి పిల్లలకు అలవాటు. ఒకసారి వెనక్కి వెళ్లి చూస్తే గతంలో పల్లెల్లో ఆడుకున్న ఆటలు.. పాడుకున్న పాటలు గుర్తుకు వచ్చి.. ఈనాటి బాల్యం ఎలాంటిదని ఆలోచిస్తే బాధ కలుగకమానదు. శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసాన్ని అందించే గ్రామీణ ఆటలు ఎన్నెన్నో ఉన్నాయి. ఈ వేసవిలో పిల్లలు ఆడుకోదగ్గ ఆనాటి అద్భుతమైన ఆటల్ని మీకు పరిచయం చేయటమే ఈ ప్రయత్నం. ఈ ఆటల్లో సిర్రగొనె, గోళీలాట, దెబ్బలచండీ, అష్టచెమ్మా, కాసెపుల్ల, బొంగరాలాట, కోతికొమ్మ, దస్తాట, పెండలబుర్రి, సీకాట, పావులాట, వీరి వీరి గుమ్మడి పండు, అగ్గిపెట్టెలతో ఫోన్ ఆట, సిగరెట్ పెట్టెలతో పత్తాలాట, రెస్, పాము నిచ్చెన, పుంజీతం, చిత్తు బొత్తు, వంగుడు-దుంకుడు, జంటల్‌టిక్క, ముట్టి చుకునుడు ఇలాంటి ఆటలు అనేక ఉన్నాయి.



● సిర్ర - గోనె

ఈతరం పిల్లలు ఆడుకునే క్రికెట్ ఆటను పోలి ఉంటుంది. సిర్ర - గొనె ఆట. దీన్నే గిల్లి దండా అని కూడా అంటారు. కనీసం ఇద్దరు కలిసి ఆడుకునే ఆట ఇది. ఈ ఆటకు రెండు కర్ర వస్తువులు అవసరం పడతాయి. అవే సిర్ర - గోనె తొలుత బద్దీలో సిర్రను ఉంచి గోనెతో చిమ్ముతారు ఒక్కరు. పైకెగిరిన సిర్రను బుక్క (క్యాచ్) పడితే చిమ్మిన వారు ఔటయినట్లు లేనిచో ఆ సిర్రను బద్దీ వైపు విసురుతారు. అది బద్దీ వద్ద పడకుండా చిమ్మిన వ్యక్తి గోనెతో అడ్డుకుంటాడు. అచ్చం ఆధునిక బ్యాటింగ్ లాగా అడ్డుకోవడంలో విఫలమై ఆ సిర్ర బద్దీకి గోనె కంటే తక్కువ దూరంలో పడితే చిమ్మిన వ్యక్తి క్లీన్‌బౌల్డ్ లాగా ఔటయినట్టు లెక్క. ఒక వేళ సఫలమే అయితే సిర్రను గోనెతో కొట్టి పైకి లేపి మళ్లీ బలంగా బ్యాటింగ్ లాగా విసిరి కొడతాడు. దూరాన్ని గోనెతో కొలిచి రన్స్ లాగా స్కోరింగ్ చేసుకుంటారు.

● వీరి వీరి గుమ్మడి పండు..



పిల్లల సమూహం నుంచి ఒకరిని పెబ్బగా ఎన్నుకుంటారు. మిగిలిన వారిని వరుసగా నిలబెట్టి అందులో ఒకరిని దొంగగా భావించి పెబ్బ కళ్లు మూస్తారు. ఎదురుగా ఉన్న పిల్లల నుంచి ఒకరిని సైగ ద్వారా ముందుకు రమ్మని పిలుస్తారు. వారి దిక్కు వేలెత్తి చూపుతూ వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేంటని కళ్లు మూసుకున్న వారిని అడుగుతారు. సరైన పేరు చెప్పగలిగితే ఆ పేరు గల వ్యక్తి దొంగవుతారు. అబద్ధమైతే ముందుకొచ్చిన వారు ముక్కుపై గిచ్చి వెళతారు.



● కాసె పుల్ల

ఇసుకలో కూర్చుని ఇద్దరాడుకునే ఆట ఇది. ఆటగాళ్లలో ఒకరు మూరెడు సైజులో ఇసుక కట్టను చేసి అందులో ఒక కట్టెపుల్లను తెలియకుండా వదిలి పెట్టాలి. తర్వాత ఇంకో క్రీడాకారిణి ఆ పుల్లను ఎక్కడుందో గుర్తు పట్టడానికి ఇసుక కట్టపై ఒక చేతివేళ్లను ఇంకో చేతివేళ్లలో అల్లుకున్నట్లుగా చేసి రెండు చేతులతో మూస్తారు. ఆ పుల్ల ఆ చేతుల కింద ఉన్నట్లుయితే దాచి పెట్టే అవకాశం వస్తుంది. కనుక్కో లేని పక్షంలో ఓడిపోయారని దోసిల్లో ఇసుకను నింపి అందులో పుల్లపెట్టి.. గెలిచిన వారు ఓడిన వారి కళ్లు మూసి ఎక్కడో దూరంగా తెలియని ప్రదేశంలో ఆ ఇసుక కుప్పను పారబోయిస్తారు. యధాస్థానానికి వచ్చిన తర్వాత కళ్లు తెరిపిస్తారు. పారబోసిన ఇసుక కుప్పను కనుక్కోవడం ఆసక్తి కరంగా ఉంటుంది.



● దస్తాట

ఓ డజను మంది పిల్లలు వృత్తాకారంలో తలను నేలకేసి వంచి కూర్చుంటారు. అందులో ఒకరు రుమాలు (దస్తి)ను పట్టుకొని వారి వెనకాల మూడు రౌండ్లు తిరిగి ఒకరి వెనక వేస్తారు. వారు గుర్తించి వెంటనే లేచి దస్తీ పట్టుకొని రౌండ్లు కొట్టి మరొకరి వెనక వేయాల్సి ఉంటుంది. దస్తీ తన వెనకున్న విషయం ఆలస్యమైతే మిగతా పిల్లలు వీపులో పిడికిలి గుద్దులు గుద్దుతారు.



● గోలీలాట.. (లక్కాట)

గోలీలాటలో ఇది ఒక భాగం. ఈ ఆటను ఎంతమందైనా ఆడుకోవచ్చు. ఒకప్పుడు పల్లెటూళ్లలో ఈ ఆటను పిల్లలు బాగా ఆడుకునేవారు. ఈ ఆటతో వారి సృజనాత్మకత కూడా పెరిగేది. వృత్తంలో ఉన్న గోలీలను గురి చూసి కొట్టడం ఈ ఆట ప్రత్యేకత. గురి చూసి కొడితేనె గెలుపు. ఈ ఆట ఇప్పుడు దాదాపు కనుమరుగైంది.

● అష్టాచెమ్మ

కొంచెం అటు ఇటుగా ఈ ఆట పచ్చీసును పోలి ఉంటుంది. నలుగురులోపు ఆటగాళ్లు దీన్ని ఆడతారు. చింతగింజలు, రాళ్లను పావులుగా వాడుకుంటూ గవ్వలతో పందెం కాస్తారు. ఇందులో అష్ట చెమ్మ అనే ప్రధాన పదాలుంటాయి. ఎవరు ముందు పావులతో ఇంటికి చేరితే వారు గెలిచినట్టు.





● కోతి కొమ్మ

వేసవి సెలవుల్లో పిల్లల్ని తోటల వైపు ఆకర్షించి చెట్లపై కోతులుగా మార్చే ఆట ఇది. ఈ ఆటలో పెద్ద పెద్ద కొమ్మలున్న చెట్టును ముందుగా ఎంచుకుంటారు. ఆటకు ముందు ఆడే పిల్లలు చప్పట్లతో ఒకరిని దొంగగా గుర్తిస్తారు. మిగిలిన వారందరూ చెట్టెక్కి కొమ్మల మీద కోతిచేష్టలతో దొంగను ఆటపట్టిస్తుంటారు. దొంగ పిల్లాడు కూడా చెట్టెక్కి ఎవరో ఒకర్ని ముట్టుకుంటే అతడు తర్వాతి ఆటలో దొంగగా రావాల్సిందే. ఆ లోపు ఆటగాళ్లందరూ దొంగకు చిక్కకుండా చెట్టు దిగడమో.. లేదా చెట్టు కింద గీయబడ్డ వృత్తంలో దూకుతారు. అన్నట్టు చిన్నారులూ.. ఆట బాగుంది. కదాని రెచ్చిపోతే చెయ్యి. కాలు విరగ్గొట్టుకోవడం ఖాయం. జరంత జాగ్రత్త.



నృత్యాలు చేస్తూ వస్తున్న దీక్షాపరులు

జై హనుమాన్

● కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి ● అంజన్నను దర్శించుకున్న వేలాది భక్తులు

● ఘనంగా హనుమాన్ చిన్న జయంతి

మల్యాల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ చిన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్తజనంతో కొండగట్టు కిక్కిరిసింది. అంజన్న దీక్షాపరుల సంకీర్తనలతో స్వామి పరిసరాలు భక్తి పారవశ్యంతో పులకించాయి. భక్తులు శ్రీరామ భక్తుడు హనుమంతుడిని తమ సంకీర్తనలతో కొలిచారు. అంజన్న దీక్షాపరులతో కొండగట్టు పుణ్యక్షేత్రం శనివారం రాత్రి కాషాయవర్ణాన్ని పులుముకుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో అంజన్న దీక్షాపరులు కొండపైకి చేరుకుని 41, 21, 11 రోజుల దీక్ష బూనిన వారు మాల విరమణ చేశారు. ఘాట్‌రోడ్డు, మెట్లదారుల గుండా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజనంతో నిండింది.



మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు

● ఘనంగా హనుమాన్ చిన్న జయంతి

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా చైత్ర పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ఈ జయంతిలో భాగంగా అంజన్నకు విశేష అభిషేకం, తులసీ అర్చన, స్వామివారికి పట్టు వస్త్రాలంకరణ నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, స్థానిక శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం అంజన్నను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈవో శ్రీకాంత్‌రావు, ఉత్సవాల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్ స్వామి, రఘు ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొండగట్టు అంజన్న స్వామిని రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందించారు.





కోనేరు వద్ద భక్తజనం

● కొండపైనే కలెక్టర్, ఎస్పీ మకాం..



సీసీ కెమెరాల ద్వారా భక్తుల రద్దీ పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ నిత్యం కొండపైన ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెండు రోజులుగా భక్తులు అధికంగా వచ్చే సమయంలో కొండపైన కలియతిరుగుతూ అర్ధరాత్రి వరకు కొండపైనే ఉంటూ, భక్తుల వద్దకు వెళుతూ సమస్యలు తెలుసుకొని తగు పరిష్కార సూచనలు ఇచ్చారు. సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీ, దీక్షా విరమణ, దర్శనాలు తదితరవి పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని అధికారులకు సూచనలు చేశారు.

● అడుగడుగునా ఇబ్బందులు.. భక్తుల అసహనం

మల్యాల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం జరిగిన హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలి రాగా అడుగడుగున భక్తులు ఇబ్బందులు పడ్డారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రస్తుతం ఉన్న సిబ్బందికి తోడు మరో 366 మందిని అదనంగా ఉత్సవాల కోసం నియమించినప్పటికీ ఎక్కడపడితే అక్కడ చెత్త ఉండడంపై మండిపడ్డారు. అలాగే భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లోనూ సకాలంలో నీరు అందుబాటులో ఉంచకపోవడంతో ఎండలతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. దీక్షాపరుల మాలవిరమణ సందర్భంగా కొందరు అర్చకులు డబ్బులు వసూలు చేయడం, తలనీలాలు సమర్పించే చోట క్షురకులు డబ్బులు ఇస్తేనే తలనీలాలు తీస్తామంటూ బలవంతంగా డబ్బులు డిమాండ్ చేశారు. ఎంతో భక్తిప్రపత్తులతో వస్తే బలవంతంగా వసూలు చేయడమేంటని భక్తులు ఆరోపించారు. స్నానాల కోసం కాంట్రాక్టర్లు రూ.20నుంచి 30వరకు వసూలు చేశారని అంజన్న సన్నిధిలో వ్యాపారులు అధిక ధరలతో తమను నిలువు దోపిడీకి గురి చేశారంటూ కొందరు భక్తులు ఆరోపించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఘాట్‌రోడ్డు పక్కన చలివేంద్రం దుస్థితి

వైభవంగా మహమ్మాయిదేవి జాతర

● తరలివచ్చిన భక్తులు

● ప్రత్యేక పూజలు, హోమాలు



మహమ్మాయి దేవి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహాశక్తి పీఠంగా పూజలు అందుకుంటున్న మహమ్మాయి దేవి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాష్ట్రంలోని నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎండను సైతం లెక్కచేయకుండా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. మమామ్మాయి అమ్మ వారిని దర్శనం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు అన్నీ నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు వాహనాలను కొంత దూరంలోనే పార్కింగ్ చేయించారు. వారం రోజులుగా ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయి. శనివారం జాతర కావడంతో ఉదయంనుంచి భక్తుల తాకిడి మొదలయింది. ఆదివారం తెల్లవారుఝాము వరకు భక్తులు దర్శనం కోసం వస్తుంటారని ఆలయఉత్సవాల నిర్వాహకకమిటీ ప్రతినిధి దేవరకొండ కృష్ణమాచార్యులు తెలిపారు. ఆలయంలో నిర్వహించిన హోమాలు, పూర్ణాహుతి, అమ్మ వారికి అర్చన పూజలు ఘనంగా నిర్వహించారు. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎండల నుంచి ఉపశమనం కోసం చలువ పందిళ్లతో పాటు చల్లని నీరు, మజ్జిగ ఏర్పాట్లు చేశారు.

నేడు పెద్దాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర

జూలపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పెద్దాపూర్ గ్రామశివారులో గల యోగానంద లక్ష్మీనర్సింహస్వామి జాతర ఆదివారం జరగనుంది. ఆదివారం వేకువజామున రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు గొట్టిముక్కుల రవిందర్‌రెడ్డి, గొట్టిముక్కుల రాజభాస్కర్ రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రథోత్సవానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మంచిర్యాల, తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీసులు వాహనాల పార్కింగ్, తదితర ఏర్పాట్లను పరిశీలించారు.



ముస్తాబైన యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్ధతు ధరను పొందాలని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాలో సెర్ప్- ఐకేపీ ఆధ్వర్యంలో తలపెట్టిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సబేరాబేగం మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, నర్సయ్య, రాంరెడ్డి, గౌస్, తిరుపతిరెడ్డి, గణేశ్‌నాయక్, శ్రీనివాస్, లక్ష్మీ, బుచ్చాగౌడ్, బాల్‌రెడ్డి, అనిల్‌నాయక్, రైతులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గరుడ సేవ.. రేపు రథోత్సవం

గంభీరావుపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్రమూర్తి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడసేవ, సోమవారం స్వామి వారి రథోత్సవం జరగనుంది. మండల కేంద్రంలోని పురాతన సీతారామాలయంలో వారంరోజులుగా బ్రహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. అశ్వ, పొన్న, హన్‌మాన్ తదితర సేవలపై స్వామి వారిని ఊరేగించారు. స్వామి వారి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఘనంగా గరుడసేవ, సోమవారం భక్తుల కన్నుల పండువగా రథోత్సవం జరగనుంది. ఆలయ అభివృద్ధి, నిర్వహణ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరు గ్రామంలో భక్తిప్రపత్తుల మధ్య వేంకటేశ్వర స్వామి రథోత్సవం జరిగింది. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను రథంపై పెట్టి ఊరేగించారు. రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. ఈసందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలలో జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం



చందుర్తిలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్

చందుర్తి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ పనిచేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బిజెపి నాయకులు గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, మండల బిజెపి అధ్యక్షులు మొకిలే విజేందర్, నాయకులు పొంచెట్టి రాకేష్, సిర్రం తిరుపతి, మర్రి మల్లేశం,చిలుముల హనుమాయ చారి, మోత్కుపల్లి రాజశేఖర్ పాల్గొన్నారు

కోనరావుపేట: కోనరావుపేట మండలం రామన్నపేట గ్రామంలో శనివారం భారతీయ జనతా పార్టీ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు తీగల జయశ్రీ ఆధ్వర్యంలో గావ్ ఛలో బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరిగి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మండల వైస్ ప్రెసిడెంట్ తీగల రవీందర్ గౌడ్, బిజెపి నాయకులు సుధగోని సాయికృష్ణ, గుడిసె మల్లయ్య, ఆంజనేయులు, కరుణాకర్‌రెడ్డి, సుధాకర్, రాజేశం, చింతల పరుశరాములు, యశోద రాజు, దండు శంకర్, దోర్ల శంకర్, బిక్షపతి మల్లేశం, రాఘవులు, తిరుపతి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో శనివారం గావ్ ఛలో- బస్తీ ఛలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన వివరాలతో ముద్రించిన కర పత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక నిధులతో కేటాయిస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, గణేశ్, శ్రీనివాస్, లక్ష్మణ్, ప్రదీప్‌రెడ్డి, భానుచందర్, రవి, ప్రశాంత్, రాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలో విద్యార్థి ఆసక్తికర సమాధానం

చందుర్తి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని ఓ పాఠశాలలో 4వ తరగతి విద్యార్థిని ఆంగ్లంలో అడిగిన ప్రశ్నకు సమాధానం ఆసక్తిగా రాసింది. పాఠశాలలో జరుగుతున్న వార్షిక పరీక్షల్లో శనివారం జరిగిన ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంలో మీ అమ్మకు నచ్చినది.. నచ్చని వాటి గురించి సమాధానం రాయండి అని అడిగారు. ఓ విద్యార్థిని అమ్మకు నానమ్మ, తాతయ్య నచ్చరని సమాధానం రాయడంతో ఆ ఉపాధ్యాయుడు ఆశ్చర్యపోయారు. నేటికాలంలో ఇంట్లో కోడళ్లకు అత్త, మామల పట్ల ప్రేమ ఏ విధంగా ఉందో విద్యార్థి సమాధానం ద్వారా అర్థమవుతుంది. కుటుంబాల్లో బాంధవ్యాలు కనుమరుగు అవుతున్నాయని దానికి నిదర్శనం అని పేర్కొంటున్నారు. ఈ విషయం ఉపాధ్యాయుల్లో చర్చనీయాంశంగా మారింది.

విషాదం నింపిన క్షణికావేశం

● కట్టుకున్న భర్త కాటికి.. కటకటాల పాలైన కొడుకు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆనందంగా గడుపుతున్న ఆ కుటుంబంలో క్షణికావేశం విషాదాన్ని నింపింది. జులాయిగా తిరగవద్దని మందలించిన కన్న తండ్రిని అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు పొట్టన పెట్టుకున్నాడు.. కట్టుకున్న భర్త కుంచెం కనకయ్య కాటికి వెళ్లడం.. కన్న కొడుకు పర్శరాములు కటకటాల పాలవడంతో దిక్కుతోచని స్థితిలో ఆమె అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం విషాదం నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని కనకయ్య దినసరి కూలీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొడుకు పర్శరాములు పనులు చేయకుండా తిరగడంతో తండ్రి కనకయ్య మందలించాడు. ఈ నెల 11న తండ్రీకొడుకుల మధ్య గొడవ తారస్థాయిగా చేరింది. కోపోద్రిక్తుడైన కొడుకు పర్శరాములు కన్న తండ్రి కనకయ్యపై కర్రతో దాడి చేసి పారిపోయాడు. స్పృహ కోల్పోయిన ఆయనను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే కనకయ్య మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలానికి సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్సై రమాకాంత్ చేరుకొని పరిశీలించారు. తండ్రిని చంపి పారిపోయిన కొడుకు పరశురాములను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. భర్తకు భార్య దేవవ్వ అంత్యక్రియలు నిర్వహించింది.

కాషాయమయమైన రాజన్న ఆలయం

● రాజన్నను దర్శించుకున్న అంజన్న భక్తులు ● అగ్రహారంలో ప్రత్యేక పూజలు



వేములవాడ రాజన్న ఆలయంలో అంజన్న భక్తులు



అగ్రహారంలో అంజన్న రథోత్సవం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం శనివారం హనుమాన్ జయంతిని పురష్కరించుకుని కాషాయమయంగా మారింది. హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టుకు వెళ్లే భక్తులు ముందుగా శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకున్నారు. ఆలయంలోకి చేరుకున్న భక్తులు ముందుగా రాజన్నకు అత్యంతప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరావడంతో గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించారు. కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారుగా రెండు గంటలపాటుగా బారులు తీరారు.

హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వేములవాడ రాజన్న ఆలయంలోని హనుమాన్, శ్రీభీమేశ్వర స్వామి వారి ఆలయంలోని హనుమాన్ దేవాలయాల్లో రాజన్న ఆలయ అర్చకులు శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా వేములవాడ మండలంలోని అగ్రహారం శ్రీజోడాంజనేయ స్వామి వారి ఆలయంలో ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 4.30 గంటలకు సంకల్పం, మన్యసూక్త, అభిషేకం, బాలభోగము, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ గావించారు. ఉదయం 5.30 గంటలకు అభిషేకము, అర్చనలు ఉదయం 8 గంటలకు శ్రీస్వామి వారి జెండా ఎత్తుట, 9.30 గంటలకు ఉత్సవ మూర్తులకు అభిషేకము, నిత్యహవనం, పూర్ణాహుతి, బలిహారణ చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు రథోత్సవంలో భాగంగా అష్టబలులు, జిష్టికుంభం, కుష్మాండబలి, గ్రామబలి 4.30 గంటలకు గ్రామోత్సవంలో భాగంగా శ్రీస్వామి వారిని ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

అంజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్..

వేములవాడ మండలం అగ్రహారం జోడాంజనేయస్వామి వారిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం దర్శించుకున్నారు. అంజన్న ఆలయానికి వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆలయ ఈవో శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీస్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు. కాగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి అంజన్నను దర్శించుకున్నారు.



అగ్రహారం అంజన్నను దర్శించుకుంటున్న విప్ ఆది శ్రీనివాస్

కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం



గంభీరావుపేటలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి



కందికట్కూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

గంభీరావుపేట/ముస్తాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అప్రజాస్వామిక అవినీతి అరాచక పాలన బీఆర్ఎస్ పార్టీదని, సంక్షేమం, అభివృద్ధి ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వానిదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో శనివారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కేకే మహేందర్‌రెడ్డి ప్రసంగించారు. దేశం కోసం, దేశ ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కించపరిచే విధంగా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. రాజ్యాంగ హక్కులను కాలరాసే విధంగా బీజేపీ కుట్ర రాజకీయాలను ప్రోత్సహిస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు కాని హామీలు, మాయ మాటలు చెప్పిందని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు 3 ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇండ్లు వంటి హామీలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. 8 లక్షల కోట్ల అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. అందుకే తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ రుణం తీసుకోటానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం సురక్షితంగా ఉన్నంత కాలం మన బతుకులు కూడా సురక్షితంగా ఉంటాయన్నారు. కాంగ్రెస్ అంటేనే దళిత బడుగు బలహీన వర్గాల పార్టీ అని అన్నారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక కేవలం 10 నెలల వ్యవధిలోనే 57 వేల ఉద్యోగాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమం అనంతరం రాజ్యం పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల పార్టీ అధ్యక్షులు హమీద్, బాల్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్, నాయకులు తిరుపతి, రామచంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజిరెడ్డి, రాజు, ప్రభాకర్, గౌరిశంకర్, వెంకటి, బంగ్ల రాజు, జంగం రాజులు, సురేష్, బాలయ్య, మల్లయ్య తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగపరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. మండలశాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మండల ఇంచార్జీ సూర దేవరాజ్ ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెలిచాల జ్యోతి, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ముత్యం అమర్ గౌడ్, యాస తిరుపతి, కిషోర్‌గౌడ్, బిగుళ్ళ విజయ్, కొమురయ్య, రవీందర్‌గౌడ్, కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, వెంకటరెడ్డి, రోషాలు, రజనీకాంత్, జమాల్ పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో హనుమాన్ జయంతి



ధర్మపురి ప్రసన్నాంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి, గడ్డ ఆంజనేయ స్వామి, హనుమాన్‌వీధి ఆలయాల్లో, చింతామణి చెరువు వద్ద భక్తజన సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది హనుమాన్ దీక్షాపరులు, భక్తులతో క్షేత్రం రద్దీగా ఏర్పడింది. ఉదయం వేళలో స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి అనుబంధ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో, రావిచెట్టు ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివా సాచార్యులు, అర్చకులు ఒద్దిపర్తి నరసింహమూర్తి, రుత్వికులు, అర్చకులు స్వామివారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ఎల్లారెడ్డిపేటలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సిరిసిల్ల పెద్దబజార్ హనుమాన్ దేవాలయంలో పూజలు



చందుర్తిలో పాదయాత్రగా తరలి వెళ్తున్న హనుమాన్ భక్తులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, కోరుట్లపేట, సింగారం, బండలింగంపల్లి, నారాయణపూర్, వెంకటాపూర్, అల్మాస్‌పూర్, రాజన్నపేట, దుమాల, అక్కపల్లి, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దీక్షా పరులు నృత్యాలు చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆయా గ్రామాల్లో సాయంత్రం ఆంజనేయ స్వామి చిత్ర పటంతో గ్రామాల పుర వీధుల గుండా శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు.

సిరిసిల్ల రూరల్ : హనుమాన్ జయంతి వేడుకలు మండలంలో శనివారం భక్తిప్రపత్తుల మధ్య కొనసాగాయి.సిరిసిల్ల పట్టణంలోని పెద్దబజార్, పద్మనగర్, నెహ్రూనగర్, బీవైనగర్, వెంకంపేటలతో పాటు చిన్నబోనాల,రగుడు, చంద్రంపేట, రాజీవ్ నగర్, పెద్దూర్, సర్దాపూర్ గ్రామాల్లో ని హనుమన్ దేవాలయాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ దీక్షాదారులతోపాటు ప్రజల భక్తి శ్రద్దలతో ప్రత్యేకపూజలుచేసి స్వామివారి ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులతోపాటు తాజా మాజీ కౌన్సిలర్‌లు పత్తిపాక పద్మశంకర్, కల్లూరి రాజు, పోచవేణి సత్య ఎల్లయ్య, పాతూరి రాజిరెడి, బోల్గం నాగరాజుగౌడ్, బుర్రలక్ష్మీశంకయ్య, బుర్ర మల్లిఖార్జున్, గొల్లపల్లి బాలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాలలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిప్రపత్తుల మధ్య నిర్వహించారు. గ్రామాలలోని హనుమాన్ ఆలయాలలో ప్రత్యేక పూజలు, పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగం పలికారు. ఆలయాలకు వెళ్లిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ముందస్తు అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో శనివారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్‌తోసయ పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం విశేష అభిషేక పూజలతో పాటు హనుమాత్ కవచహవనం పూజలు నిర్వహించారు. ఈ పూజలకు భక్తులు, హనుమాన్ మాలదారులు హాజరయ్యారు.

తంగళ్లపల్లి : మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో హనుమాన్ దేవాలయం వద్ద దోర్నాల జయరామిరెడ్డి - లక్ష్మీ దంపతులు అన్నప్రసాదం వితరణ చేశారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు అన్నదాన వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పద్మనగర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంతోపాటు నర్సింగాపూర్, బండపల్లి, మల్యాల, లింగంపేట్, తదితర గ్రామాలలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో హనుమాన్ శోభాయాత్రలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ భక్తులు కొండగట్టుకు తరలి వెళ్లారు.

కోనరావుపేట : కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి విగ్రహానికి అదే గ్రామానికి చెందిన పబ్బ అంజయ్య 50 వేల విలువ గల మకర తోరణం ఏర్పాటు చేశారు. అనంతరం అర్చకులు ఆశీర్వదించారు.



నిమ్మపల్లిలో ఆంజనేయ విగ్రహం వద్ద పూజలు



వీర్నపల్లిలో పూజలు నిర్వహిస్తున్న హనుమాన్ మాలధారులు



రాచర్లగొల్లపల్లిలో హోమం నిర్వహిస్తున్న పురోహితులు